రహదారులు వర్షార్పణం

- చిరుజల్లులకే చిత్తడిగా మారుతున్న రోడ్డు
- గుంతలమయంగా మారి రాకపోకలకు ఇక్కట్లు
- ద్విచక్రవాహనాలు సైతం నడవలేని దుస్థితి



దొడ్డిపల్లి రోడ్డు దుస్థితి



గోతులమయంగా మల్లారెడ్డిపల్లి రోడ్డు

నవాబుపేట: మండలంలోని మల్లారెడ్డిపల్లి, దొడ్డిపల్లి రోడ్లు పూర్తిగా ధ్వంసమై దారుణంగా మారాయి. వర్షాలు వచ్చాయంటే చిత్తడిగా మారి రాకపోకలకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. మల్లారెడ్డిపల్లి నుంచి కారూర్, దొడ్డిపల్లి, కిష్టారం వెళ్లే రోడ్డు మొత్తం గోతులమయంగా తయారయ్యాయి. కనీసం ద్విచక్రవాహనం సైతం నడవడం కష్టంగా ఉంది రోడ్డు పరిస్థితి. కాగా నియోజకవర్గం కేంద్రం జడ్చర్ల, లేదా జాతీయ రహదారికి చేరుకోవాలంటే చాలామంది ప్రయాణికులు ఈ దారిని ఎంచుకుంటారు. కాగా రోడ్డు గోతులమయం కావడంతో చుట్టూ తిరుగుతూ వెళ్లాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



లక్ష్మీపల్లి రోడ్డు గుంతలమయం

దేవరకద్ర రూరల్: మండలంలోని చౌదర్‌పల్లి నుంచి లక్ష్మీపల్లి వెళ్లే బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 44వ జాతీయ రహదారిని కలుపుతూ 2017లో 17కిలో మీటర్ల రోడ్డు పనులకు గత ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసి 4కిలో మీటర్ల పనులు చేసి నిలిపివేశారు. దీంతో ఆ రూట్‌లో వెళ్లే ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. పనులు పూర్తి చేయడంపై అధికారులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టి సమస్యను పరిష్కారించాలని సంబధిత అధికారులను సంప్రదించినా ఫలితం లేకపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేముల రోడ్డుపై అడుగుకో 'గుంత'



వేముల రోడ్డుపై ఏర్పడిన గుంతలు

అడ్డాకుల: మూసాపేట మండలం వేములకు వెళ్లే దారిలో రోడ్డంతా గుంతలమయంగా మారింది. చందమామ బావినుంచి కోజెంట్ గ్లాస్ కంపెనీ రోడ్డు వరకు అడుగుకో గుంత అన్నట్లుగా తయారైంది. 44వ నెంబర్ జాతీయ రహదారి నుంచి రాయిచూర్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు పనులు మొదలై ఎనిమిది ఏళ్లు దాటినా.. పనులు పూర్తి కావడం లేదు. హైవే నుంచి వేముల పాఠశాలకు బీటీరోడ్డు వేశారు. మధ్యలో చందమామ బావినుంచి కంపెనీ రోడ్డు వరకు బీటీరోడ్డు వేయలేదు. ఇక్కడ రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. రోడ్డుపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో వర్షం నీళ్లు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ రోడ్డుపై నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. వీటితోపాటు కంపెనీ బస్సులు కూడా రాకపోకలు సాగిస్తాయి. పాడైన రోడ్డుతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదిలా ఉంటే వేముల పాఠశాల నుంచి లక్ష్మీపల్లి రోడ్డు వరకు కంకర వేసి వదిలేశారు. కంకర మూలంగా వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ములేచి రోడ్డుకిరువైపులా నివాసాల్లో ఉండేవారు సహవాసం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోస సంబంధిత వ్యాధులకు గురవుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



మెట్టుగడ్డ: స్నేహితుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని దేవునిగుట్ట కాలనీకి చెందిన మహిళలు, చిన్నారులు ఆదివారం పిల్లలమర్రిలో సందడి చేశారు. కేక్ కట్చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పర్యావరణ హితం కోరుతూ ఫ్రెండ్‌షిప్ బాండ్ బదులు మట్టి గాజులు వేసుకుని ఆటపాటలతో సందడిగా గడిపారు.

నవాబుపేటలో చిన్నారులు



నవాబుపేట: స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారులు తమ స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ.. ఆటల్లో మునిగి తేలారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం పాఠశాలలకు సెలువు కావడంతో ఆటవిడుపుగా ఆడుకుంటూ ఒకచోట చేరి ఫ్రెండ్ షిప్ అక్షరాలు ప్రదర్శిస్తూ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన గాయత్రి మహాయజ్ఞం



జడ్చర్ల టౌన్: ఆర్యసమాజ మందిరంలో నిర్వహిస్తున్న శ్రావణమాస త్రిదివసీయ గాయత్రి మహాయజ్ఞం ఆదివారం పూర్ణాహుతితో ముగిసింది. కార్యక్రమానికి వివిధ జిల్లాల ఆర్య సమాజ అధ్యక్షులు, ఆర్యబంధువులు పాల్గొన్నారు. యజ్ఞంలో పాల్గొన్న ముఖ్య అతిథులు వేద విద్వాంసులు శ్రీవేదమిత్ర మాట్లాడుతూ యజ్ఞయాగాలు చేయడంతో ప్రకృతి కాలుష్యం నివారించబడుతుందని, వ్యాధులు రాకుండా యజ్ఞంలో వేసే ఔషధాల వల్ల మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్యసమాజ పెద్దలు బాద్మిశివకుమార్, నర్సింహులు, బక్కరాజు, విజయ్‌కుమార్, కృష్ణయ్య, లవకుమార్, అశోక్, విజయలక్ష్మి, నందిని, స్రవంతి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్‌లో ఉన్న పోచమ్మ ఆలయంలో 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఆలయంలో ఈనెల చివరలో బోనాల ఉత్సవం జరగనున్న నేపథ్యంలో ఆలయ అభివృద్ధి కమిటీ విజ్ఞప్తి మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. వాటిని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీతో పాటు భక్తులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన రజక సంఘం నాయకులు



జడ్చర్ల టౌన్: రజకులను బీసీ ఏ నుంచి ఎస్సీ జాబితాలోకి మార్చే అంశాన్ని పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి జాతీయ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ శ్రీనివాస్ విన్నవించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలుసుకుని ఒకే వృత్తి చేస్తున్న దోబీలకు భిన్న రిజర్వేషన్లు ఉండటంతో ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు తలెత్తుతున్నాయని వివరించారు. ఎలాగైనా ఎస్సీ జాబితాలోకి మార్చేలా చూడాలని కోరారు. మంత్రిని కలసిన వారిలో దోబీ రిజర్వేషన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు గోపి, అధికార ప్రతినిధి నర్సింగరావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

స్థానికంలో పార్టీని బలోపేతం చేయండి



మహమ్మదాబాద్: రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. ఆదివారం మండలంలోని గాదిర్యాల్, మహమ్మదాబాద్‌లో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో విజయం సాధించడానికి అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, కాశీనాథ్, ఆంజనేయులు, నవీన్, చౌదరి శ్రీనివాస్, పెంటయ్య, హరిప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండో శిక్షణతో ఆత్మవిశ్వాసం



మహబూబ్‌నగర్ క్రీడలు: తైక్వాండో శిక్షణతో శారీరక దారుఢ్యంతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం విద్యార్థులకు తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌బాబు మాట్లాడుతూ.. తైక్వాండో క్రీడలో జిల్లా విద్యార్థులు ప్రతిభచాటాలని కోరారు. ఈ గ్రేడింగ్ పరీక్షల్లో సుజన్‌కుమార్, రాజేందర్, అరవింద్, అబ్దుల్ ఖాదర్, అశ్విన్ ఎల్లో బెల్టులు, అమలశ్రీ ఎల్లో వన్ బెల్టు, శ్రీలేఖ, శ్రీనిధి, చందు గ్రీన్ బెల్టులు, రోషిని, ఆది శంకర్ గ్రీన్ వన్, అఖిల్ బ్లూ, ఎండి.రేహన్ బాబా, ధర్మతేజ్ రెడ్ బెల్టులు, హరిచరణ్‌రెడ్డి రెడ్ వన్‌బెల్టులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయిలు, కోశాధికారి శంకర్, సీనియర్ కోచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలపై పోరాడుదాం



జడ్చర్ల టౌన్: కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో రెండురోజులుగా జరుగుతున్న సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ట్రేడ్ యూనియన్ పని పద్ధతులు అంశంపై బోధన చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గానికి వ్యతిరేకంగా కార్పోరేట్లకు అనుకూలంగా తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐ టీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, సహా య కార్యదర్శి తెలుగు సత్తయ్య, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై ఢిల్లీలో చర్చించేలా చేశాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- పాలమూరులో బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ రిజర్వేషన్ గురించి దేశ రాజధాని ఢిల్లీలో చర్చించేలా సీఎం రేవంత్‌రెడ్డి చేశారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాతపాలమూర్‌లోని కమ్యునిటీ హాల్‌లో బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా డబుగుబలహీన, అనగారినవర్గాల స్థితిగతులను ఆయన స్వయంగా తెలుసుకున్నారన్నారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి కులగణన చేయించిందన్నారు. న్యాయనిపుణుల సలహాలు తీసుకుని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు ఎస్పీ వెంకటేష్, గోపాల్‌యాదవ్, మైత్రి యాదయ్య, కృష్ణముదిరాజ్, చందుయాదవ్, శ్రీనివాసులు, వెంకటనర్సయ్య, శ్రీనివాస్‌సాగర్, గుండా మనోహర్, సంజీవ్‌రెడ్డి, భారత్‌కుమార్, బుగ్గన్న పాల్గొన్నారు.

మైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం స్థానిక ఏనుగొండలోని మైసమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మైసమ్మ తల్లి అందరిని చల్లగా చూడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, రామస్వామి, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఉన్నతంగా ఆలోచించాలి



పిరమిడ్ మాస్టర్లతో శ్రీహరి

హన్వాడ: ప్రతిఒక్కరు ఉన్నతంగా ఆలోచించాని అప్పుడు జీవితంలో మార్పులు మొదలవుతాయని సీనియర్ పిరమిడ్ మాస్టర్లు శ్రీహరి, భారతలక్ష్మి అన్నారు. ఆదివారం హన్వాడ మండలంలోని దాచక్‌పల్లి మహేశా పరిమిడ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డోన్ నుంచి వారు హాజరై మాట్లాడారు. ధ్యానం అలవర్చుకోవాలన్నారు. ధ్యానంతో ఆరోగ్యంగా ఉంటారని రోగాలు దరిచేరవన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. నిత్య సాధన ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. అహింసా మార్గంలో నడవాలని, మాంసాహారంతో ఈర్ష్యా, ద్వేషం, అసూయ పెరిగి జీవితమే చిన్నాభిన్నం అవుతుందన్నారు. పూర్తిగా శాకాహారం తీసుకొని ఆరోగ్యండ ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పంపల్లిలో పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిన్నచింతకుంట: కొకుంట్ల మండలం అప్పంపల్లిలో 1998-99 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థులు స్నేహితుల దినోత్సవాని పురస్కరించుకొని ఆదివారం ప్రాథమిక పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించున్నారు. కలిసి విద్యను అభ్యసించి వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఆదివారం ఒకచోట చేరారు. ఆనాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. అనంతరం వారికి విద్యను బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. అలాగే రూ.25వేలతో పాఠశాలకు జారుబండ, వీలు కుర్చీలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు గురుప్రసాద్, రవికుమార్‌రెడ్డి, వెంటరాజరెడ్డి, రాధాకృష్ణారెడ్డి ఆర్మీ, సుదర్శన్‌రెడ్డి ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తోటి విద్యార్థులు వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు వెంకటన్న, భాస్కర్, వీరేశం, రాములు, ఉమలతోపాటు పలువురు ఉన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం అప్పంపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. గ్రామానికి నిత్యం విద్యుత్ సరఫరా చేసే మినీ ట్రాన్స్‌ఫార్మర్లు జీపీ ఆవరణలో అధికారులు ఏర్పాటు చేశారు. కాని వాటిని పర్యవేక్షించడంలేదు. వాటిచుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్లపొదులు ఏపుగా పెరిగాయి. దీంతో వర్షాలు కురిసినప్పుడు ఎర్త్ వచ్చి మంటలు చెలరేగి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



యూరియా సరఫరాలో ఇబ్బందులు రానివ్వొద్దు

నవాబుపేట: యూరియా సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని బీకేఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని అమ్మాపూర్‌లో బీకేఎస్ మండల నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా విషయంలో కొరత సృష్టించి రైతులను ఇబ్బందులు చేయరాదన్నారు. రైతులకు కావాల్సిన యూరియాను ఒకేసారి అందించి వారి కార్డుకు లింక్ చేయాలని సూచించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, భీమయ్య, చంద్రయ్య, వెంకటేశ్, రాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి చెంత ప్రత్యేక పూజలు

నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ చెంత ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అడవిలో భక్తుల కోలాహలం కొనసాగింది. శ్రావణమాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతోపాటు అమ్మవారికి ఇష్టమైన బోనాల మొక్కులు చెల్లించడం ఆచారం. దీంతో ఆదివారం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇప్పించారు.

టీపీఆర్టీయూ కార్యవర్గం ఎన్నికపై హర్షం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రంగారెడ్డి జిల్లాలో జరిగిన టీపీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. ఈ మేరకు జిల్లాకు చెందిన చెన్నయ్యను టీపీఆర్టీయూ రాష్ట్ర అఅధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా రత్నాకర్‌రావు, గౌరవాధ్యక్షుడిగా యుగంధర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నికపై జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, రమాకాంత్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ప్రైవేట్ పీఈటీల సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలోని ప్రైవేట్ పీఈటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రైవేట్ స్కూల్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోహైల్ ఉర్ రెహమాన్, వినోద్‌కుమార్ ఇతర ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రైవేట్ స్కూల్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూళ్ల టీచర్లకు ఎస్‌జీఎఫ్ మండల, జిల్లాస్థాయి క్రీడల్లో సమాన గుర్తింపు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ పీఈటీలకు నైపుణ్యాలు, అవగాహన పెంపొందించడానికి శిక్షణ తరగతులు అవసరమని అన్నారు. సమావేశంలో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి జియావుద్దీన్, కోశాధికారి విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్ విడుదల



మహమ్మదాబాద్: గోవాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ స్టేడియంలో ఈనెల 7న జరిగే ఓబీసీ 10వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా బీసీసంఘాల అధ్యక్షుడు వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మహాసభ వాల్‌పోస్టరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడంలో ఎంతో అన్యాయం చేస్తున్నాయని తెలిపారు. అందుకు ఈనెల 7న గోవాలో ఏర్పాటు చేసే జాతీయ మహాసభలో చర్చించేందుకు పెద్దలు, విద్యావంతులు నిర్ణయించారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీను, సత్యం, అంజి, హరి, నర్సింహులు, దస్తయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఎఫ్ఐ జెండావిష్కరణ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రజతోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ఎటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం సంఘం పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకులు కిష్టయ్య మాట్లాడుతూ.. విద్య ఉమ్మడి జాబితాలో ఉండాలని, విద్య ఆయా రాష్ట్ర స్థానిక పరిస్థితుల ఆధారంగా శాస్త్రీయ వైఖరులను అలవర్చుకునే విధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, వెంకటేశ్, ఉమాదేవి, వేణుగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ, రాష్ట్రస్థాయికి ఎంపికైన వారికి సన్మానం

మక్తల్: హైదరాబాద్‌లో బండ్ల గూడల్లో నిర్వహించిన ఖేల్ ఇండియా ఉమెన్స్‌రోడ్డు స్పీడ్ సైక్లిలింగ్ పోటీల్లో 5, 10, 20 కి.మీ.లలో జాతీయ, రాష్ట్రస్థాయిలకు ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి మందిరంలో మక్తల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్య ఆంజనేయులు బాలికలను, మహిళలను శాలువాతో సన్మానించి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రీడారంగంలో విద్యార్థులను ముందుకు తీసుకెళ్లి మక్తల్‌కు మంచి పేరు తీసుకరావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పీఈటీలు అంబ్రేస్, రమేష్, త్రివేణి, స్వరూప, సౌమ్య, వెన్నల, గాయత్రి, అనూష, మల్లేశ్వరి, అంకిత, సంగీత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

మరికల్: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మరికల్ విద్యార్థులు ఎంపిక కావడంతో ఆదివారం డీఈఓ గోవిందరాజులు వారిని అభినందించారు. మండల కేంద్రంలోని రిషి హైస్కూల్ పాఠశాలకు చెందిన గణేష్, విగ్నేష్, చరణ్‌తేజ జిల్లా స్థాయిలో జరిగిన యోగా పోటీలో విజేతలుగా నిలిచి, వారు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. వారిని డీఈఓతో పాటు డీఎంహెచ్ఓ బాలాజీ, పతాంజలి అధ్యక్షుడు సురేష్‌కుమార్ కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అశోక్, సాయికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.